ఏఐజీ హాస్పిటల్స్ 800 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్‌లో ఆంకాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 11: ప్రముఖ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ ఏఐజీ హాస్పిటల్స్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. రూ.800 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఆంకాలజీ సెంటర్‌ను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ప్రొటాన్ బీమ్ థెరపీ సిస్టాన్ని కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఆంకాలజీ సెంటర్లలో ఇది మూడోది కావడం విశేషం. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇది తొలుతది. క్యాన్సర్ అడ్వాన్స్ థెరపీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏఐజీ..ఐబీఏ నుండి అధునాతన ప్రొటాన్ బీమ్ థెరపీలో క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఇందుకోసం బెల్జియం కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న ఐబీఏతో జట్టుకట్టింది. ప్రొటాన్ బీమ్ థెరపీ అనేది రేడియోషన్ థెరపీలో అత్యంత ఖచ్చితమైన సమాచారం ఇవ్వనున్నది. ఇది అసాధారణమైన ఖచ్చితత్వంతో కణితులను లక్ష్యంగా చేసుకొని వైద్య సేవలు అందిస్తుంది. అలాగే చుట్టుపక్కలవున్న ఆరోగ్యకరమైన కణజాలాలకు హానిని గణనీయంగా తగ్గించడం ఈ థెరపీ ప్రత్యేకత. హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ క్యాంపస్‌లోనే నెలకొల్పుతున్న ఈ సెంటర్ 300 పడకల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఆంకాలజీ సెంటర్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నది.

ఏఐజీ హాస్పిటల్స్‌లో మేము చేసే ప్రతి పనిలోనూ రోగులను కేంద్ర బిందువుగా ఉంచడమే మా అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం. ప్రొటాన్ బీమ్ థెరపీ సిస్టమ్, ఐబీఏతో వ్యూహాత్మక భాగస్వామ్యంతో అత్యాధునిక సంరక్షనను అందించే మా లక్ష్యంలో ఒక పరివర్తనాత్మక ముందడుగును సూచిస్తాయి. ఇందుకోసం గచ్చిబౌలీ క్యాంపస్‌లో క్యాన్సర్ రోగులకోసం ప్రత్యేకంగా 300 పడకలతో ఆంకాలజీ సెంటర్‌ను నెలకొల్పబోతున్నాం.

- డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్

దూసుకుపోతున్న ఎల్ఐసీ

2024లో 15 శాతం వృద్ధిని సాధించిన సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) దూసుకుపోతున్నది. ప్రైవేట్ బీమా సంస్థల నుంచి పోటీ తీవ్రతరమైనప్పటికీ అధిక వృద్ధిని సాధిస్తున్నది. 2024 సంవత్సరంలో నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 14.64 శాతం వృద్ధిని సాధించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ విషయాన్ని వెల్లడించింది. బీమా రంగ ఇండస్ట్రీ 14.41 శాతం వృద్ధిని సాధించగా, ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు 14.55 శాతం వృద్ధి కనబరిచాయి. గడిచిన 12 నెలల్లో ఎల్ఐసీ రూ.2,33,073.36 కోట్ల ప్రీమియం వసూళ్లు జరపగా, క్రితం ఏడాదిలో రూ.2,03,303 కోట్లుగా ఉన్నాయి. మొత్తంమీద లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ రూ.4,02,773.18 కోట్ల మేర ప్రీమియం కలెక్షన్లు జరిపాయి. దీంట్లో ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు రూ.1,69,699.83 కోట్ల మేర ప్రీమియం వసూళ్లు చేశాయి. 2023లో వసూలు చేసిన రూ.1,48,323.21 కోట్లతో పోలిస్తే 14.41 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో ఇండివిజ్యువల్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 4.92 శాతం వృద్ధిని సాధించింది. రూ.58,486.69 కోట్ల నుంచి రూ.61,365.75 కోట్లకు పెరిగాయి. గడిచిన సంవత్సరంలో ఎల్ఐసీ 1.96 కోట్ల పాలసీలు, స్కీంలను జారీ చేసింది. అంతక్రితం ఏడాది విక్రయించిన 2.01 కోట్ల పాలసీలతో పోలిస్తే 2.72 శాతం తగ్గాయి.

పారిశ్రామికం వెలవెల!

పెట్టుబడిదారుల్లో గుబులు రేపుతున్న కక్ష రాజకీయాలు



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొద్దిరోజులుగా నెలకొన్ని ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపు వైఖరితో పారిశ్రామికరంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నది. కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న పరిశ్రమలు పక్కచూపులు చూసే పరిస్థితి నెలకొన్నది. ఓ వైపు కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఏపీలో భారీగా పారిశ్రామికవాడల అభివృద్ధి జరుగుతుండగా, మరోవైపు హైడ్రా వంటి కొత్తకొత్త వ్యవస్థలతో ప్రభుత్వమే ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేయడంతో రాష్ట్ర భవిష్యత్తుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు రావాలంటే ముఖ్యంగా ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం ఏర్పడాలి. ఆ తరువాత శాంతిభద్రతలు అదుపులో ఉండడం, సహృద్భావ వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలు ప్రభావితం చేస్తాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. పదేళ్లపాటు సజావుగా సాగిన పారిశ్రామిక రంగంలో ఓ విధమైన స్తబ్దత నెలకొన్నది. ప్రభుత్వంలోని ప్రముఖుల ప్రతీకార రాజకీయాలకు పాల్పడటంతో అశాంతి నెలకొన్నది. విపక్ష నేతలే లక్ష్యంగా రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి విచారణలు, దర్యాప్తులు చేపట్టడంతో అలజడి వాతావరణం ఏర్పడింది. దీనికితోడు అక్రమ నిర్మాణాల పేరుతో చేపట్టిన కూల్చివేతల కార్యక్రమం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. పేదల గుడిసెలతోపాటు భారీ భవంతులను కూడా నిర్లక్షంగా కూల్చివేయడంతో కొత్తగా ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసేవారు వెనక్కితగ్గుతుండగా, అన్నీ సవ్యంగా ఉన్న ఇళ్లకు సంబంధించిన యజమానులు కూడా భయాందోళనలకు గురవుతున్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాలకు ఎంతో ప్రధానమైన సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. అప్పటి ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై ప్రముఖ కంపెనీ కేన్స్ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక అది గుజరాత్‌కు మకాం మార్చడం గమనార్హం. ముఖ్యంగా గుజరాత్‌లో ఇప్పటికే పలు సెమీకండక్టర్ల కంపెనీలు కొలువుదీరి అక్కడి ఎకోసిస్టం అభివృద్ధి కావడం, మన రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలు పరిశ్రమకు అనుకూలంగా లేకపోవడంతో సెమీకండక్టర్ కంపెనీలు గుజరాత్‌కు క్యూ కడుతున్నాయి.

కక్షపూరిత చర్యల వల్ల రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పెట్టుబడి పెట్టేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. మన పెట్టుబడి సురక్షితమేనా? ఇక్కడ పెట్టుబడి వల్ల మనకు లాభాలొస్తాయా? అనే విషయాలు వారు ఆలోచిస్తారు. కాబట్టి ప్రభుత్వాలు కక్ష రాజకీయాలు కాకుండా చట్టబద్ధమైన చర్యలు మాత్రమే చేపట్టాలి.

- జేడీ లక్ష్మీనారాయణ, సీబీఐ మాజీ సంయుక్త సంచాలకులు

ఎగరేసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్

ఇదిలావుంటే, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అభివృద్ధి వేగం పెరిగింది. ఇటీవల పరిశ్రమల శాఖ అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి రాష్ట్రంలో 100 పారిశ్రామికవాడల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఒక్కో ఇండస్ట్రియల్ పార్క్ 100 ఎకరాలకు తగ్గకుండా ఉండాలని అధికారులకు స్పష్టంచేశారు. అంతేకాకుండా కొత్త ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలైన్ల అభివృద్ధి, ఇతర నగరాలతో రోడ్డు కనెక్టివిటీని పెంచేందుకు స్పష్టమైన కార్యప్రణాళికలు ప్రకటించారు. ముఖ్యంగా గతంలో ఏర్పాటుచేసిన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం 99 ఏళ్ల లీజుకు భూములను సరసమైన ధరలకు సమకూర్చడంతోపాటు అనేక విధాలుగా పన్నురాయితీలను ప్రకటించింది. దీంతో తెలంగాణకు వచ్చే పెట్టుబడులకు ఏపీకి తరలిపోతున్నాయి. ఏపీలో సుస్థిర ప్రభుత్వం, కేంద్రం సహకారం పుష్కలంగా ఉండటం, శాంతిభద్రతల సమస్య లేకపోవడంతో పెట్టుబడిదారులు అక్కడివైపు చూస్తున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం పెట్టుబడులకు అనుకూలంగా లేదని, కక్షపూరిత రాజకీయాలతో తమకు నష్టం జరుగుతున్నదని పెట్టుబడిదారులు భయపడుతున్నారని వారు పేర్కొంటున్నారు. గత సంవత్సరకాలంగా ప్రభుత్వం ఒప్పందాల పేరుతో హడావుడి చేస్తున్నప్పటికీ వచ్చిన కంపెనీ ఒక్కటీ లేదని, దీన్నిబట్టి రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకోవచ్చని వారు చెబుతున్నారు.

నయా పల్సర్ ఆగయా

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..దేశీయ మార్కెట్లోకి నయా పల్సర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాత మాడల్‌తో పోలిస్తే నూతన ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ బైకు ధర రూ.1.84 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ కొత్త బైకు రూ.10 వేలు అధికం.

హ్యుందాయ్ సరికొత్త మాడళ్లు

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్..దేశీయ మార్కెట్లోకి నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన వెన్యూ, వెర్నా, గ్రాండ్ ఐ10 నియోస్‌లను మరింత ఆధునీకరించి మార్కెట్లోకి విడుదల చేసింది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ.. కంఫర్ట్, ఆధునిక ఫీచర్స్‌తో తయారు చేసినట్లు కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ తెలిపారు. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన వెన్యూ మాడల్‌లో స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, 20.32 సెంటిమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్/స్టాప్, పూర్తిగా ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్‌తో తయారు చేసింది. వెర్నా రూ.12.37 లక్షల నుంచి రూ.15.26 లక్షల వరకు, గ్రాండ్ ఐ10 నియోస్ రూ.7.09-8.29 లక్షల లోపు, వెన్యూ రూ.9.28-10.79 లక్షల లోపు లభించనున్నాయి.

జస్ట్ డయల్ 131 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రాంతీయ సర్చ్ ఇంజిన్ జస్ట్ డయల్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ. 131.31 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.92.01 కోట్ల లాభంతో పోలిస్తే 42.7 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 8.4 శాతం ఎగబాకి రూ.287.33 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు రూ.215.57 కోట్లకు తగ్గాయని పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ అధికారి శ్వేతంక్ దీక్షిత్ మాట్లాడుతూ..నిర్వహణ ఖర్చు లు తగ్గడంతో లాభాల్లో వృద్ధి నమోదైందన్నారు.

స్పిన్సైలో వెయ్యి ఉద్యోగాలు

హైదరాబాద్, జనవరి 11:డిజిటల్ హెల్త్‌కేర్ సేవల సంస్థ స్పిన్సై టెక్నాలజీ..రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ప్రకటించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మరింత విస్తరించనున్నట్లు, క్లినికల్ కోలాబరేషన్, పేషంట్ ఆర్థిక సేవల కోసం కొత్తగా ఏఐ ఆధారిత ఉద్యోగులను తీసుకోనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు రజిత్ కుమార్ తెలిపారు. ఇక్కడ అసాధారణమైన ఏఐ నిపుణులు ఉన్నారని, మిషిన్ లెర్నింగ్, డాటా అనలటిక్స్, డిజిటల్ హెల్త్ సేవలను అందించాలని ఉద్దేశంతో ఈ నియామకాలు చేపట్టినట్లు చెప్పారు.

డీ-మార్ట్ లాభం 723 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 11: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.723.54 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.690.41 కోట్ల కంటే ఇది 4.8 శాతం అధికమని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17.68 శాతం ఎగబాకి రూ.15,972.55 కోట్లకు చేరుకున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.13,572.47 కోట్లుగా ఉన్నది. నిర్వహణ ఖర్చులు 18.52 శాతం ఎగబాకి రూ.15,001.64 కోట్లకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ నెవెల్లీ నోరోన్హా మాట్లాడుతూ..పలు ఎఫ్ఎంసీజీ విభాగ ఉత్పత్తులను తగ్గించడం. మెట్రో నగరాల్లో స్టోర్లు అధికమవడం వల్లనే ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపుతున్నదన్నారు. గత త్రైమాసికంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్లు 21 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది.

వ్యవసాయ శాఖలో సమస్యలు పరిష్కరించండి

అగ్రికల్చర్ కమిషన్ సభ్యుడికి అధికారుల విన్నపం

అగ్రికల్చర్ కమిషన్ సభ్యుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న వ్యవసాయ, ఉద్యానవన అధికారులు

విద్యానగర్, జనవరి 11 : వ్యవసాయ శాఖలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ శాఖ జిల్లా అధికారులు అగ్రికల్చర్ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌కు విన్నవించారు. శనివారం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ వసతి గృహంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో జరిగిన ఇష్టాగోష్ఠిలో గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ శాఖలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. రుణమాఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం ఆవిష్కృతమవుతున్న నూతన వంగడాలు, సాగు విధానాలు, వాణిజ్య పంటలు, మార్కెటింగ్ సదుపాయాలను రైతులకు ఎప్పటికపుడు చేరవేయాలని అన్నారు. అనంతరం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖలో చాలా సంవత్సరాలుగా పదోన్నతులు కల్పించడం లేదని, వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. శాఖ కార్యాలయాల్లో కూడా కనీస వసతులు లేకుండా పోయాయని, పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, అధికారులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మహేశ్, రణధీర్, ప్రియదర్శిని, సునీత, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు శ్రీనివాస్, రోహిత్, రషీద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో పలువురు ఉద్యోగుల బదిలీ

కలెక్టరేట్, జనవరి 11: జిల్లా రెవెన్యూ శాఖలో పలువురు ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ, ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ, రెవెన్యూ విభాగపు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆదేశాలు వెలువరించారు. ముగ్గురు నాయబ్ తహసీల్దార్లు, 13 మంది సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లకు బదిలీ స్థానాలు కేటాయించారు. కలెక్టరేట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహసీల్దార్ స్వరూపారాణి చిగురుమామిడి మండలానికి, మానకొండూర్ మండల ఎన్నికల డీటీగా కొనసాగుతున్న రాకేశ్‌ను తిమ్మాపూర్ మండలానికి, అక్కడ నాయబ్ తహసీల్దార్‌గా కొనసాగుతున్న లక్ష్మణ్ ఎస్డీసీ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. అలాగే, కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న అశోక్ తిమ్మాపూర్, అక్కడ కొనసాగుతున్న అక్బర్ హుస్సేన్ కలెక్టరేట్‌కు, అలాగే గిర్దావర్ రజనీకుమార్ కొత్తపల్లి, అక్కడ విధులు నిర్వహిస్తున్న మన్మిత్‌సింగ్ కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న మాధవిని బదిలీ చేయగా, ఇంకా ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. వీణవంక నుంచి శ్రీనివాసరావు బదిలీ కాగా వెయిటింగ్‌లో ఉన్నారు, కలెక్టరేట్‌లో కొనసాగుతున్న అరుణ్ చిగురుమామిడికి బదిలీ కాగా, అక్కడి నుంచి సంపత్ కలెక్టరేట్‌కు, అయేషా షారఫత్ గంగాధర నుంచి కలెక్టరేట్ ఎస్డీసీకి బదిలీ అయ్యారు. చొప్పదండి నుంచి బదిలీ అయిన లక్ష్మీనారాయణ వెయిటింగ్‌లో ఉండగా, కలెక్టరేట్ ఎస్డీసీ నుంచి ఆశ్రామహ్మది చొప్పదండికి బదిలీ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, జనవరి 11 : వివిధ ప్రభుత్వశాఖల్లో దశాబ్దాల తరబడి విధులు నిర్వహిస్తున్న పొరుగు సేవల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒంటెల రఘువీర్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కాపువాడలో గల ఆసంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పొరుగు సేవల ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వారంతా పలు ఏజెన్సీల కింద కొనసాగుతున్నారని తెలిపారు. ఆయా విభాగాల నుంచి ఏజెన్సీలకు మాత్రమే డబ్బులు చెల్లిస్తుండడంతో, వాటి యజమానులు వీరికి సక్రమంగా విడుదల చేయడం లేదని ఆరోపించారు. అలాగే, ఆయా ఏజెన్సీల పునరుద్ధరణ సక్రమంగా జరుగకపోవడంతో నెలల తరబడి వేతనాలు అందడంలేదన్నారు. దీంతో, ఉద్యోగుల కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కనీస వేతన చట్టం అమలు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మహమూద్, రజనీకర్, వెంకటేశ్వర్లు, వైద్య శ్రీహరి, తణుకు శ్రీధర్, ఉల్లెంగల మహేందర్, మల్లీశ్వరి, శ్రీదేవి, లత, రఘుపతి, మల్లికార్జున్‌రెడ్డి, మనోహర్, శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, తదితరులు

- వాటికి భయపడేది లేదు
- కేసీఆర్ పేరు నచ్చకపోతే, పేరు మార్చి పథకాలు అమలు చేయాలి
- నా ఫైట్ పోలీసులతో కాదు.. రేవంత్ రెడ్డితోనే
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, జనవరి 11: ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, వాటికి భయపడేదిలేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 169 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మేనమామలా మంచి ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకం కింద లక్షానూటా పదహారు రూపాయలకు అందిస్తూ తెలంగాణ ఆడబిడ్డలకు ఆసరయ్యారని గుర్తు చేశారు. ఎన్నికలప్పుడు ఈ పథకం కింద తులం బంగారం సైతం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మొండి చేయి చూపిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం ప్రతి మహిళకు 2500 రూపాయలు అందించే వరకూ ఎన్ని కేసులు పెట్టినా వెనుకాడేదిలేదన్నారు. కేసీఆర్ పేరుతో ఉన్న పథకాలను ఆపడం వల్ల పేదలు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పథకాలకు కేసీఆర్ పేరు పెట్టడం నచ్చకపోతే, వాటి పేరు మార్చుకొని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని, దీనిపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే తనపైనే కేసు పెట్టారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తనపై 30 కేసులు పెట్టారని తెలిపారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా హుజూరాబాద్ గడ్డ నీళ్లు తాగిన బిడ్డగా, భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రాణాలు పోయినా ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ గ్రాంట్లను 119 నియోజకవర్గాల్లో సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల, హుజూరాబాద్, కరీంనగర్ 5 నియోజకవర్గాలకు ఇవ్వొద్దని సీఎం చెబుతున్నారని తెలిపారు. రూ.40 కోట్ల నిధులకు ప్రపోజల్ పెడితే, ఇప్పటిదాక ఇచ్చింది లేదన్నారు. తాను ఇచ్చిన ఎన్నికల హామీల ప్రకారం హుజూరాబాద్ నియోజకవర్గానికి వెయ్యి కోట్ల నిధులను కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో లేకపోవడం వల్ల తీసుకురావడం లేదన్నారు. నిధుల కోసం తొక్కని గడప, కలవని మంత్రి లేదని తెలిపారు. నిధులు ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదన్నారు. ప్రజలకు ఏ అవసరాలున్నా.. తన వద్దకు రావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కంచెలతో రాజ్యం నడిపిస్తున్నదని ధ్వజమెత్తారు. తన ఫైట్ పోలీసులతో కాదని, ప్రభుత్వం, రేవంత్ రెడ్డితోనేనని స్పష్టం చేశారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పోలీసులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయమన్నారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు సైతం సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకున్నానని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ప్రారంభానికి ప్రజలందరినీ ఆహ్వానిస్తానన్నారు కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం కల్యాణలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం ఇచ్చే వరకు, మహిళలు ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో సంక్రాంతి సంబురాలు



సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న మెడికవర్ సిబ్బంది

విద్యానగర్, జనవరి 11 : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్‌లో శనివారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు ఉత్సాహంగా హాజరయ్యారు. మహిళా ఉద్యోగులు రంగోలి పోటీలో పాల్గొని అందమైన రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డాక్టర్ వినయ్, డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ ప్రతిష్టారావు, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ సంక్రాంతి ఉత్సవం

తెలంగాణచౌక్, జనవరి 11: నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నగర సంఘచాలక్ హనుమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభంకానున్న ఉత్సవంలో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025-26విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతితో పాటు 6-9వ తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అల్గునూర్ సీవోఈ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.వంద చెల్లించాలని, విద్యార్థి కుల ఆదాయ, బర్త్ సర్టిఫికెట్, విద్యార్హత పత్రాలు, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ ఫిబ్రవరి1 అని, పరీక్ష ఫిబ్రవరి23న ఉంటుందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి గర్హణీయం

కలెక్టరేట్, జనవరి 11: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ గుండాలు దాడి చేయడం గర్హణీయమని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందని, అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని హరించడం సిగ్గుచేటని శనివారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రాన్ని గుండాల రాజ్యంగా మార్చుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీల పైన దాడులు చేస్తూ, ఇదేమిటంటే దాబాయించి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.